# వాస్తవం

"**త**ల తిరుగుడు మాత్రం తగ్గటంలేదు... ఏమిటో..." నిట్టూరుస్తూ అంది కామాక్షి భర్తతో.

"నెల రోజుల నుంచీ నీరసం అని కూడా అంటున్నావు. ఈ వేళయినా డాక్టరు దగ్గిరకు వెళ్దాం పద..." అన్నాడు విశ్వం. కామాక్షి వద్దంటూ నసిగింది. కానీ అతను వినిపించుకోలేదు.

కాసేపటిలోనే ఇద్దరూ కలిసి హాస్పటల్‌కి వెళ్ళారు. డాక్టర్ జోగారావు బాగా పెద్దాయన. అందరితో సరదాగా, ఆప్యాయంగా మాట్లాడతారు. కొంత మంది డాక్టర్లలా అవసరం అయినా కాకపోయినా కూడా నాలుగు రకాల టెస్టులూ, పది రకాల మందులూ రాసెయ్యటం బొత్తిగా అలవాటు లేదు. విశ్వానికి ఆయనంటే బాగా గురి.

డాక్టరుగారు కామాక్షిని "ప్రోబ్లమ్ ఏమిటమ్మా...?" అనడిగారు.

"తల తిరుగుతోందండీ..." కామాక్షి చెప్పింది.

"లేదమ్మా... స్థిరంగానే ఉంది. కనపడుతోందిగా..." అన్నారాయన చిరునవ్వుతో.

"అంటే... తలలోపల... ఏదో..." అంటూ నసిగింది.

"లోపల కూడా ఏం లేదమ్మా... నీట్‌గానే ఉంది... తెలుస్తోందిగా..." అన్నారు అదే చిరునవ్వుతో.

కామాక్షి కొంచెం రోషంగా చూసే సరికి సర్దుకుని "నేను వేరే ఉద్దేశంతో అనలేదమ్మా! అనవసరమైన ఆలోచనలతో గజిబిజిగా కాకుండా మెదడు ఆరోగ్యంగానే ఉన్నట్లుందని అంటున్నా. కళ్ళల్లోని కాంతిని బట్టి ఆ విషయం తెలుసుకోగలను!" జోవియల్‌గా అని కామాక్షిని పరీక్ష చేసి అంతా బాగానే ఉందని చెప్పారు.

కామాక్షి మొహంలోని అసంతృప్తిని గమనించి... తప్పనిసరని గ్రహించి కొన్ని టెస్టులు రాసి రిపోర్టుతో మళ్ళారమ్మని చెప్పారు.

రెండువేల ఖర్చుతో టెస్టులన్నీ చేయించుకుని రెండు రోజుల తరవాత డాక్టరు దగ్గరకు వెళ్ళారిద్దరూ. రిపోర్టులన్నీ చూసి అంతా బాగానే ఉందని డాక్టరు చెప్పగానే కామాక్షి మొహంలో మళ్ళీ అసంతృప్తి కనపడింది.

డాక్టరుగారు "చూడమ్మా... మన ఇంటికయితే ఎన్నిసార్లయినా రంగులు వేయించుకోవచ్చు... ఎన్ని హంగులయినా ఏర్పాటు చేసుకోవచ్చు! కానీ ఒంటికి మాత్రం జబ్బు వచ్చినప్పుడు మాత్రమే మందులు వాడాలి. అంతకన్నా చేయటానికేం లేదు మరి! పళ్ళు, కాయగూరలు బాగా తీసుకుంటే సరిపోతుంది" అని చెప్పి పంపించేశారు.

ఇంటికి వచ్చాక కామాక్షి ధుమధుమలాడింది.

"డాక్టరుగారు జోగారావనే పేరు మార్చుకుని జోకుల్రావని పెట్టుకుంటే సరిపోతుంది! లేకపోతే ఏమిటా మాటలు...! నేను ఇంటి గురించి గొడవ పెడుతున్నానని ఆయనకు ముందుగా చెప్పారు కాబోలు! వాస్తుపండితుడికి చూపించి సలహా తీసుకోమంటున్నానుగానీ కొత్తగా హంగులేమీ చేయించమని అడగటంలేదుగా...!"

"తెలిసిన డాక్టరు కాబట్టి సరదాగా అన్నారుగానీ నేనేం చెప్పలేదు! నువ్వే అనవసరంగా భుజాలు తడుముకుంటున్నావ్! కొంచెం తీరుబడిగా ఇంట్లో ఉంటే తల తిరగటమూ తగ్గుతుంది! ఇరుగూ పొరుగూ మాత్రమేకాదు, ఊళ్ళో ఉన్న స్నేహితులు... పొరుగూళ్ళల్లో ఉన్న బంధువులు... ఎవరింట్లో పెళ్ళికయినా షాపింగ్‌కి నీ హాజరు తప్పనిసరి అయిపోతోంది!"

విశ్వం మాటలకు కామాక్షి పెదవులపైకి కొంచెం అతిశయంతో కూడిన చిరునవ్వు వచ్చింది!

"అవును మరి! బట్టలూ, నగల మంచీ చెడ్డా తెలుసుననీ, నా సెలక్షను బాగుంటుందనీ అందరూ రమ్మని పిలుస్తారు! రానని బెట్టుచేయటం ఏం బావుంటుందీ...!" అంది.

అక్కడే కూర్చుని వీక్లీ తిరగేస్తున్న పద్మిని తల్లి మాటలకు నవ్వింది! "సెలక్షన్ కోసం కాదమ్మా... షాపింగ్ అంటే నీకున్న సరదాకొద్దీ టాక్సీ ఛార్జీలు పెట్టుకుంటూ ఉంటావని పిలుస్తారంతే.! మొన్న కృష్ణవేణమ్మగారమ్మాయి నా ఫ్రెండుతో ఏమందో తెలుసా...! 'కామాక్షి ఆంటీ షాపింగ్‌కి వచ్చి మాకు ఛాయస్ లేకుండా చేసింది... అన్నీ తనకు నచ్చినవే కొనాలంటుంది...' అని చెప్పిందట! లేనిపోని తలనొప్పి, కీళ్ళనొప్పులూ కొని తెచ్చుకోవటం కాకపోతే నీకెందుకొచ్చిన గొడవమ్మా...!" అంటూ తల్లి చెప్పే సమాధానం వినాల్సిన అవసరం లేదన్నట్లుగా వీక్లీ అక్కడ పడేసి లేచి వెళ్ళిపోయింది.

కామాక్షి రుసరుసలాడుతూ భర్తవేపు చూసి "గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్లుగా ఇలా ఎందుకు మాట్లాడుతుందో తెలిసిందా...?" అంది.

తెలియదన్నట్లుగా తలవూపుతూ అయోమయంగా చూశాడు.

"సుందరం పిన్ని చెప్పిన మాటలు నిజం అవుతున్నాయి! వాస్తుదోషాన్ని బట్టి ఈ ఇంట్లో ఉండే పెద్దవాళ్ళకి పిల్లలతో సమస్యలూ, అనారోగ్యం వచ్చిపడతాయని చెప్పిందిగా...! అలాగే జరుగుతోంది! నా జబ్బేమిటో డాక్టరుకే అంతుచిక్కలేదు! నైన్త్‌క్లాసు చదివే పిల్ల నాకే నీతులు చెబుతూ ఇప్పుడే ఇలా మాట్లాడుతోందంటే... ముందు ముందు ఇంకా ఎంత పెంకిగా తయారవుతుందో... ఎన్ని సమస్యలు తెచ్చి పెడుతుందో... భగవంతుడా...!" అంటూ తలపట్టుకుంది.

విశ్వానికి చిర్రెత్తింది. "బట్టతలకీ... మోకాలికీ ముడిపెట్టినట్లున్నాయి నీ మాటలు...! ఇక అన్నిటికీ ఒకే కారణమా...? అర్థం పర్థం లేకుండా మాట్లాడకు... కుక్కర్ అరుస్తోంది.... వెళ్ళి చూడు..." గట్టిగా కసురుకున్నాడు.

"ఏదైనా ముంచుకు వచ్చేవరకూ మీరు నా మాటలు వినిపించుకోరులెండి..." సణుగుతూ లోపలకు వెళ్ళింది.

★ ★ ★ ★ ★

ఎప్పుడో పెళ్ళయిన కొత్తలో కొనుక్కున్న స్థలంలో సంవత్సరం క్రితమే విశ్వం ఇల్లు కట్టుకున్నాడు. నచ్చినచోట, నచ్చిన విధంగా కట్టుకోగలిగినందుకు భార్యాభర్తలిద్దరూ బ్రహ్మానంద భరితులయ్యారు.

నెలా పదిహేను రోజుల క్రితం కామాక్షికి పిన్ని వరుసయ్యే దూరపు బంధువు సుందరమ్మ వచ్చింది. కొత్త ఇంటికి ఆవిడ రావటం అదే మొదటిసారి గనుక కామాక్షి సంబరంగా ఇల్లంతా చూపించింది. ఇల్లంతా పరీక్షగా చూస్తూ ఆవిడ మళ్ళీ మళ్ళీ తిరిగింది. ఆ తరవాత కూర్చుని నాలుగు నిముషాలు దీర్ఘంగా ఆలోచించి "ఈ ఇంట్లోకి వచ్చాక మీకు బాగానే ఉందా...?" అనడిగింది.

వాళ్ళిద్దరూ అయోమయంగా చూసి "బాగానే ఉన్నాంగా...!" అన్నారు.

అలా ఉండటానికి వీల్లేదన్నట్లుగా విస్తుపోతూ... ఉత్తరం, దక్షిణం... ఈశాన్యం, నైరుతి, ద్వారబంధాలు... కిటికీలు, ఉచ్చస్థానం... నీచస్థానం లాంటి పదాలతో ఆ ఇంటి వాస్తుదోషాల గురించి విశదీకరించి "అర్థమైందా...?" అనడిగింది.

"చెప్పేవాడికి వినేవాడు లోకువ అని సామెత ఉందిగా! దాన్నే మీరు చెప్పేవాడు ఉచ్ఛ స్థానంలోనూ, వినేవాడు నీచస్థానంలోనూ ఉంటారని చెబుతున్నారంతేగా... అర్థమైంది!" వ్యంగ్యంగా అన్నాడు విశ్వం.

ఆవిడ నుదుటిమీద అరచేత్తో కొట్టుకుని "సరే... మీకర్థమయ్యేట్లుగా మామూలుగా చెబుతాను..." అంటూ వాళ్ళ స్థాయికి బాగా కిందకు దిగివచ్చినట్లుగా మొహం పెట్టి మళ్ళీ వివరించింది.

"మీ ఇంటికని బయలుదేరి వస్తున్న అదృష్టలక్ష్మి వాస్తు ప్రకారం లేని గేటుని చూసి ఆటో దిగకుండా ఎటో వెళ్ళిపోతోంది...! మీ నట్టింట్లోకి నడిచి రావాల్సిన అష్టైశ్వర్యాలన్నీ అడ్రసు మార్చుకుని ఎవరింట్లోకో తరలిపోతున్నాయి! వాస్తు పండితుడి సలహా ప్రకారం ఇంటికి మార్పులూ, చేర్పులూ చేయిస్తే మేలు కలుగుతుంది! లేకపోతే మాత్రం వాస్తు దోషాలవల్ల పెద్దవాళ్ళకి అనారోగ్యం, పిల్లల వల్ల మనస్తాపం తప్పవుగాక తప్పవు...!"

ఆవిడ సలహా ఇస్తోందో... శపిస్తోందో అన్నది అర్థంకాక విశ్వానికి అయోమయంగా అనిపించింది! కానీ, కామాక్షికి మాత్రం సాక్షాత్తూ అదృష్టలక్ష్మే తన పిన్ని రూపంలో వచ్చి మేలుకోరి సలహా ఇచ్చినట్లుగా భావించింది!

సుందరమ్మ వెళ్తూ ఫణిభూషణరావనే వాస్తు పండితుడి అడ్రసు కామాక్షికి ఇచ్చింది. ఆయనెంత గొప్పపండితుడో వివరంగా చెప్పి... ఆయన సలహాలను పాటించి, కష్టాల నుంచి గట్టెక్కటమే కాక ఎనలేని సిరిసంపదలతో తులతూగుతున్న పెద్దవాళ్ళెందరినో ఉదాహరణలుగా కూడా చూపించింది! ఆయన ప్రతీ నెలా మొదటివారంలో ఆ ఊరికి వస్తుంటారు. కాబట్టి ముందుగానే ఉత్తరం రాసి అపాయింట్‌మెంట్ తీసుకోవాలనీ లేకపోతే ఆయనది బిజీ షెడ్యూల్ కాబట్టి అవకాశం దొరకకపోవచ్చనీ హెచ్చరించింది! ఆవిడ వెళ్ళాక కామాక్షి విశ్వాన్ని "మా పిన్ని చెప్పింది. అర్థమైందిగా...?" అనడిగింది.

"అర్థమైంది... తెలిసీ తెలియకుండా మాట్లాడేవాళ్ళని అనుమతించకూడదని...!" కోపంగా అన్నాడు.

"తెలియకపోవటం ఏమిటీ... పిన్నికి అన్ని విషయాలూ బాగా తెలుసు! నాకయితే పిన్ని మాటలకు రుజువు కూడా కనిపించింది! ఆ మధ్య నేనూ పక్కింటావిడా షాపులో బట్టలు కొన్నప్పుడు లాటరీ కూపన్లు ఇచ్చారుగా... నాకు ఏ ప్రైజూ రాలేదు గానీ ఆవిడకు మిక్సీ వచ్చింది..."

కామాక్షి మాటలకు మధ్యలోనే అడ్డంపడి విశ్వం వ్యంగ్యంగా నవ్వుతూ "ఓహో... అయితే అదృష్టలక్ష్మి ఎటో కాకుండా పక్కింటికే వెళ్ళిందని నీకు క్లూ దొరికిందన్నమాట! మీ పిన్ని తెలివితేటలు నీకూ వచ్చేశాయ్...!" అన్నాడు.

విశ్వానికి వాస్తు శాస్త్రస పట్ల నమ్మకమూ లేదు... అపనమ్మకమూ లేదు. స్థిరమైన అభిప్రాయం లేకపోవటం వల్ల ఎవరేది చెబితే అదే నిజమనిపిస్తుంది!

విశ్వంతోపాటు పనిచేసే సత్యమూర్తి ఒకసారి ఏదో మాటల సందర్భంలో "వాస్తు అంటే నాకేమాత్రం నమ్మకం లేదండీ... ఇంటిమూలలూ, ఎత్తుపల్లాలూ మన అదృష్టానికీ, ఐశ్వర్యానికీ, ఆయుష్షుకు కూడా కారణం కాగలిగితే... మరి కర్మ సిద్ధాంతం మాటేమిటి...? మనం చేసే మంచీ చెడ్డకు ఫలితం ఉండనట్లేనా...!" అంటే ఆ మాటలు నూటికి నూరుపాళ్ళూ నిజమేననిపించాయి!

ఇంకో ఫ్రెండు "మన పూర్వులు విజ్ఞానంతో, తమ అనుభవసారంతో ఏర్పరిచిన సిద్ధాంతాల్లో... శాస్త్రసాల్లో... ఏదో అర్థమూ, ఎంతో పరమార్థమూ ఉండి తీరతాయ్! వాస్తు నియమాల్ని పాటించి మేలు పొందిన పదిమందీ చెప్పిన మాటల్ని కాదని ఎలా అనగలం...? ఆ పదిమందీ తెలివి తక్కువ వాళ్ళూ, మనమొక్కళ్ళమే తెలివైనవాళ్ళమూ అనుకోవటం మూర్ఖత్వం కాదా?" అని అన్నప్పుడు ఆ మాటల్లోనూ నిజమెంతో ఉన్నట్లుగా విశ్వానికి అనిపించింది!

వాస్తు పాటించటం వల్ల లాభం ఉంటే ఉండొచ్చు... లేకపోతే లేదుగానీ నష్టం మాత్రం ఉండదుగదా అనే ఉద్దేశంతో విశ్వం ఇల్లు కట్టేటపుడు బాగా వాస్తు తెలుసని చెప్పిన ఇంజనీరుతోనే ప్లాను గీయించి ఆయన సలహాలనూ, సూచనలనూ పాటించాడు.

బిజినెస్ ప్రారంభించే ఉద్దేశంతో ఉద్యోగం మానేసి ఎప్పుడో హైదరాబాద్ వెళ్ళిపోయిన సత్యమూర్తి, విశ్వానికి రెండేళ్ళ క్రితం రైల్వేస్టేషనులో కనిపించాడొకసారి. మనిషి బాగా పాడయిపోయాడు. అతని ఆరోగ్యం గురించి విశ్వం పరామర్శించగానే తన కష్టాలు ఏకరువుపెట్టాడు.

"ఏం చెప్పమంటావయ్యా నా బాధలు...! ఎప్పుడో చవక రోజుల్లో కొన్న స్థలంలో ఇల్లు కట్టుకున్నాను. బిజినెస్‌లో ప్రొగ్రెస్ లేదని మథనపడుతూ ఏంచేయాలా అని ఆలోచిస్తున్నప్పుడు ముందు ఇంటికి వాస్తు దోషాలేవైనా ఉన్నాయేమో సరిచేయించుకొమ్మని కొందరు సలహా ఇచ్చారు. పరిస్థితులను బట్టి ఆ సూచనకి తలవంచాను. ఒక్కొక్కరుగా నలుగురిని తీసుకువచ్చి ఇల్లు చూపించాను. ఒకరు ఒకచోట గోడ పడగొట్టమంటే, మరొకరు కట్టమంటారు! అలా పడగొట్టటం... నిలబెట్టటంతో ఆర్థిక పరిస్తితిని పూర్తిగా చెడగొట్టుకున్నాను! చరాస్తులకే కాదు స్థిరాస్తులకీ కాళ్ళొచ్చి వెళ్ళిపోగా, పీకలోతు అప్పుల్లో కూరుకుపోయి ఆరోగ్యమూ పోగొట్టుకున్నాను!" అంటూ వాపోయాడు.

సత్యమూర్తి మాటలు మనసులో మెదులుతూ ఉండటంవల్లే... తన పిన్ని సలహా ప్రకారం వాస్తు పండితుడు ఫణిభూషణరావుకి ఉత్తరం రాద్దామని కామాక్షి అన్న మాటల్ని విశ్వం

వినిపించుకోలేదు. ఎట్టి పరిస్థితిలోనూ కామాక్షి సూచనని అంగీకరించకూడదని మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాడు కూడా.

☆ ☆ ☆ ☆ ☆

కుక్కర్‌ని స్టౌమీద నుంచి దించేసి వచ్చి కూర్చున్న కామాక్షిని చూసి విశ్వం నిట్టూర్చాడు. ప్రోబ్లమ్ ఏమీలేదని డాక్టరు చెప్పినా గానీ మొహంలో నీరసం బాగా తెలుస్తోంది. మునుపటి హుషారు మచ్చుకైనా లేదు! ప్రశాంతంగా ఉన్న మనసులో ఆ సుందరమ్మ అనుమానపు రాయి విసిరి వెళ్ళిందనుకున్నాడు.

రోజులు గడుస్తున్నా కామాక్షి పరిస్థితిలో మార్పు రాకపోయేసరికి విశ్వం చివరకు తన నిర్ణయాన్నే మార్చుకున్నాడు. అందుకే ఆరోజు కామాక్షికి చెప్పాడు "పద్మినితో ఆ ఫణిభూషణరావుకి ఉత్తరం రాయించు. నేను వచ్చేనెలలో వరసగా క్యాంపుల్లోనే ఉంటాను. చెక్‌మీద సంతకంచేసి ఇస్తాను. ఆయన ఏం మార్పులు చెబుతాడో అవన్నీ మీ తమ్ముడిని పిలిపించి పూర్తిచేయించు. నేను మాత్రం పడగొట్టటం... కట్టటం లాంటి చికాకుల్ని భరించలేను!"

ఆ మాటలకే కామాక్షి మొహం చాటంతయిపోయింది! అతను ఒప్పుకోవటమే గొప్ప విషయంగా అనిపించింది! నిముషం ఆలస్యం చేసినా అతను మనసు మార్చేసుకుంటాడేమో అన్నట్లుగా వెంటనే పద్మినితో ఉత్తరం రాయించేసింది!

☆ ☆ ☆ ☆ ☆

క్యాంపులో ఉన్నప్పుడు విశ్వం ఇంటికి ఫోను చేశాడు. వాస్తు పండితుడు అనుకున్న తేదీన రావటం... ఆయన సూచించిన మార్పులన్నీ చేయించటం... జరిగిపోయాయని కామాక్షి చెబుతోంటే, విశ్వం తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు! అంత చకచకా పనులన్నీ జరిగిపోవటం అతనికి అద్భుతమైన విషయంగా అనిపించింది మరి! పైగా తమకి అనుకోని విధంగా లక్షరూపాయలు కలిసి వచ్చాయని చెప్పే సరికి అతని ఆశ్చర్యానందాలు రెట్టిపంయ్యాయి.! ఏ విధంగా అనడిగితే, అది ప్రస్తుతానికి సస్పెన్స్ అనీ, ఇంటికి వచ్చిన తరవాత చెబుతాననీ కామాక్షి అనేసరికి ఇక అతను రెట్టించి అడగలేదు.

కామాక్షి తల్లితండ్రులు ఎప్పుడో ఏ పదివేలో ఫిక్సెడ్ డిపాజిట్ వేస్తే ఇప్పటికి మెచ్యూర్ అయి లక్ష రూపాయలయ్యాయి కాబోలనుకున్నాడు. అంతకు మించి మరో విధంగా ఏదీ లేదని అనుకున్నాడు.

☆ ☆ ☆ ☆ ☆

క్యాంపు నుంచి వచ్చిన విశ్వం, ఇంటిని చూసి చకితుడయ్యాడు! తనకు నచ్చిన విధంగా కట్టుకున్న ఇల్లు యథాప్రకారంగా అలాగే ఉంది మరి! ఎటువంటి రూపాంతరం చెందలేదు! సంవత్సరం పైగా ఎంతో వ్యయప్రయాసలతో ఇల్లు కట్టించుకున్నాక... పూర్తవగానే చూసుకున్నప్పుడు కలిగిన సంతోషం కంటే రెట్టింపు ఆనందం ఇప్పుడే కలిగింది!

పద్మిని తండ్రికి వాస్తు పండితుడు వచ్చినప్పటి విశేషాలన్నీ గడగడా చెప్పేసింది.

"నాన్నా... ఆ ఫణిభూషణరావుగారు మనింటికి వచ్చినప్పుడు నువ్వు ఉంటే బావుండేది! ఆయన మాటలు నీకు బాగా నచ్చేవి! అమ్మ ఆయనకి ఇల్లంతా చూపించి, తన పిన్ని చెప్పిన వాస్తు దోషాలన్నీ ఏకరువు పెడితే ఆయనేమన్నారో తెలుసా! ఎప్పుడైనా ఇల్లు కట్టుకునేముందు ఒక్కసారే వాస్తు పండితుడిని

సంప్రదించాలట! ఆ తరవాత... గాలీ, వెలుతురూ ధారాళంగా రావటం, సౌకర్యంగా ఉండటం లాంటి విషయాలను తప్ప ఇంకేమీ పట్టించుకోకూడదట! ఎవరి మాటలూ వినకూడదట! మంచి సలహేకదూ! ఆ గదిలో పైనున్న గూడులాంటి కిటికీని మూసెయ్యమని చెబితే అక్కడొక సీనరీ అంటించాం. అదీ బాగానే ఉంది! మంచాలూ అటూ ఇటూ, సామాన్లు కొన్ని ఇక్కడివి అక్కడ పెట్టించారు. అలా చేయటం వల్ల గదులు విశాలంగా కనిపిస్తున్నాయి! ఇదిగో... ఈ ద్వారబంధంపైన బిగించిన రాగిరేకు ఏమిటో తెలుసా? లోపలున్న ఇంకోరేకుమీద... ఎటువంటి వాస్తుదోషాన్నయినా హరించి, శుభాల్ని కలగజేసే మంత్రాక్షరాలున్నాయి! ఆయన ఫీజు అయిదువేలూ కాకుండా, దీనికి మాత్రం ఛార్జి వెయ్యి రూపాయలు వేరే అయింది! అమ్మ ఆరోగ్యం కూడా బాగుపడింది... మామూలుగా ఉందిప్పుడు!"

కామాక్షి మొహంలోని మునుపటి హుషారు, కళ చూసి విశ్వం చాలా ఆనందంగా ఫీలయ్యాడు! వాస్తుపండితుడికి మనసులోనే జోహారులర్పించాడు! అప్పుడు లక్ష రూపాయల లాభం గురించి ఆరా తీశాడు. ఇంటి పనులకి బ్యాంక్‌లో ఉన్న లక్ష రూపాయల్నీ ఖర్చుపెట్టమని చెక్కు ఇచ్చినా... ఆ అవసరం లేకుండానే సింపుల్‌గా పనులు పూర్తయిపోయాయి కాబట్టి.. అది లాభమేగదా అని వాళ్ళిద్దరూ నవ్వుతూ చెబుతుంటే... విశ్వం కూడా నవ్వుతూ నిజమేనని అంగీకరించాడు!

వరసగా ఇరవై రోజులపాటు ఊళ్ళు తిరగటం వల్ల బడలికగా అనిపించి విశ్వం ఆఫీసుకు రెండు రోజులు సెలవుపెట్టాడు. రెండో రోజు సాయంకాలం ఇంటిముందున్న మొక్కల దగ్గిర కుర్చీవేసుకుని కూర్చున్నప్పుడు ఆఫీసు ప్యూను వచ్చి అతనికి వచ్చిన ఉత్తరాన్ని ఇచ్చి వెళ్లాడు.

కవరు విప్పి చదివాడు.

డియర్ విశ్వం

నువ్వీపాటికి క్యాంపు నుంచి వచ్చి వుంటావని ఉత్తరం రాస్తున్నాను. మొన్నీ మధ్య నేను మీ ఇంటికి వచ్చాను. వచ్చేవరకూ అది మీ ఇల్లని నాకూ తెలియదు.

నీకు గుర్తుందా... అప్పుడెప్పుడో ఒకసారి రైల్వేస్టేషనులో కలిసినప్పుడు నీకు నా బాధలు చెప్పుకున్నాను. చితికిపోయిన నా ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకునే ప్రయత్నంలో నాకొక బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది! పోగొట్టుకున్నచోటే వెతుక్కోమని పెద్దలు చెప్పారని వెంటనే ఆ ఆలోచనని అమలుపరిచాను! నా పేరుకి ముందు 'వాస్తుబ్రహ్మ' అనే చిన్న బిరుదునూ, చివర మా తాతగారి పేరునూ జోడించి కొంచెం మార్పు తెచ్చాను.

దీర్ఘరోగి సగం వైద్యుడన్నట్లుగా... మా ఇంటి సమస్యలవల్ల నాకు వాస్తు విజ్ఞానం బాగానే అలవడింది. ఆ పైన వాస్తుకు సంబంధించిన పుస్తకాలు రెండు కొనుక్కొచ్చి క్షుణ్ణంగా చదివాను!

మనిషి జీవితగమనంలో ఎత్తుపల్లాలూ, కష్టసుఖాలూ సహజమేనని అందరికీ తెలుసు! ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో... దురదృష్టం కాటేస్తుందో ఎవరికీ తెలియదు! కాకతాళీయంగా నేను ఇచ్చిన సలహావల్లే మేలు పొందామని అనుకున్నవాళ్ళు నాకు బోలెడంత పబ్లిసిటీ తెచ్చిపెట్టారు! కలిసిరాని వాళ్ళు మాత్రం తమ ప్రాప్తం అంతే అనుకుని మిన్నకుండి వుంటారు! ఇప్పుడు నా ఆర్థిక పరిస్థితి దివ్యంగా ఉందని నీకు వేరే చెప్పనవసరం లేదనుకుంటాను!

నేను ఇంతగా ప్రాచుర్యం పొందటానికి కారణాలు రెండున్నాయని అనుకుంటాను. మొదటిది... ఫీజు ఎక్కువగా ఉండటమే! ఫీజు ఎక్కువుంటేనే జనాలకి మోజు ఎక్కువవుతుంది కదా! రెండవ కారణం ఏమిటంటే... ఎక్కువ వ్యయప్రయాసలు కలగని విధంగా చిన్న చిన్న మార్పుల్ని మాత్రమే సూచిస్తాను! ఎవరికైనాగానీ ఇంటిని ఎక్కడ పడగొట్టాల్సి వచ్చినా కష్టంగానే ఉంటుంది మరి!

నేను నీ ఫ్రెండునే అని చెప్పి ఫీజు తీసుకోకూడదని ముందు అనుకున్నాను. కానీ అలా చేయడం వల్ల పెరటిచెట్టు వైద్యానికి పనికిరాని విధంగా ప్రయోజనం ఉండదని గ్రహించాను. అందుకే ఆ ఆరువేలనూ తిరిగి పంపిం చేస్తున్నాన్నిప్పుడు. పొరపాటున కూడా ఈ విషయం మీ శ్రీశీమతికి చెప్పకు సుమా! కథ మళ్ళీ మొదటికి వచ్చినా రావచ్చు అసలు విషయం తెలిస్తే...! చదివిన వెంటనే ఉత్తరాన్ని చింపెయ్యి.

ఆ రాగిరేకులో ఉన్న మంత్రం ఏమిటో చెప్పనా...? ప్రతీరోజూ పూజానంతరం నేను మనసులో స్మరించుకునేదే... సర్వేజనా సుఖినోభవన్తు! ఉంటానిక.

– నీ మిత్రుడు సత్యఫణిభూషణరావు.

విశ్వం నవ్వును ఆపుకోలేక పైకేపెద్దగా నవ్వాడు! ఉత్తరాన్ని చింపిపడేసి చెక్కును జేబులో పెట్టుకుంటుంటే... కాఫీ కప్పుతో వచ్చిన కామాక్షి – "ఏదో చెక్కు వచ్చినట్లుందే... ఎక్కడినుంచీ?" అనడిగింది.

అసలు విషయం చెప్పబోయిన విశ్వం సత్యమూర్తి మాటలు గుర్తువచ్చి మనసు మార్చుకుని ఎవరో స్నేహతుడికిచ్చిన చేబదులు రాదని నిర్ణయించుకున్నాక ఇన్నాళ్ళకి పంపించాడని చెప్పాడు.

కామాక్షి మొహం వెలిగిపోయింది! "చూశారా... మా పిన్ని సలహా ప్రకారం ఆ ఫణిభూషణరావుగార్ని పిలిపించి వాస్తుదోషాలు లేకుండా మార్పులు చేసుకోవటంవల్ల మనకి ఎలా కలిసివస్తోందో...! లేకపోతే రాదని వదిలేసుకున్న బాకీ వసూలవటం విడ్డూరమేగా...! నా ఆరోగ్యమూ బాగుపడింది! పైకి నాలా చెప్పలేదు గానీ మీరూ నలతగానే ఉండేవాళ్ళు. ఇప్పుడు తేటగా కనిపిస్తున్నారు. మీరింత హాయిగా నవ్వటం చూసి ఎన్నాళ్ళయిందో...! అంతా ఆ రాగిరేకులోని మంత్రమహిమే...!"

కామాక్షి వేపు విభ్రాంతిగా చూసిన విశ్వం మనసులో అనుకున్నాడు. నమ్మకాన్ని మించిన అద్భుతమైన మంత్రం లేదుగాక లేదు అని!

ఈనాడు ఆదివారం. 11, మే, 2003.